ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
5
కర్నూలు





టమోటాను పారవేస్తున్న రైతు

టమోటా ధర పతనం

- పత్తికొండ మార్కెట్‌లో కిలో రూ.1 - బయట కిలో రూ.30

ప్రజాశక్తి - పత్తికొండ

టమోటా ధర పతనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి టమోటా ధర పతనం కావడంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లోని టమోటా ధర కిలో రూపాయికి పడిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పులికొండ గ్రామానికి చెందిన రైతు సుంకన్న 16 గంపల టమోటా పంటను మార్కెట్‌కు తీసుకు రాగా... వ్యాపారులు కొనుగోలు చేయలేదు. కన్నీరు కారుస్తూ టమోటా గంపలను ఫ్లాట్ ఫారంపైనే పోసి ఆవేదనతో ఇంటికి వెళ్లిపోయారు. పంటను సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయటి మార్కెట్‌లో కిలో రూ.30తో ప్రజలకు విక్రయిస్తున్నారు. జిల్లా మార్కెట్ వ్యవసాయ అధికారులు స్పందించి మార్కెట్ వేలం పాటల్లో పాల్గొని టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- మతసామరస్యం కోసం పాటుపడాలి - ఓల్డ్‌సిటీ నగరమహాసభ ప్రారంభోన్యాసంలో కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, రాజ్యాంగ పరిరక్షణ కోసం, మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం పాత బస్టాండ్ సమీపంలోని బావర్చి బాక్సెట్ హాల్ ఎస్. సోమన్న ప్రాంగణంలో సిపిఎం కర్నూలు ఓల్డ్ సిటీ 20వ నగర మహాసభ రెండోరోజు ప్రతినిధులసభ విజయ్, ఎస్ఎండి షరీఫ్, జయమ్మల అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు కెవి.సుబ్బయ్య పతాకావిష్కరణ చేశారు. అమరవీరులకు నివాళి అర్పించారు. ప్రతినిధుల సభలో ముందుగా సిపిఎం నాయకులు సీతారాం ఏచూరి, సోమన్న చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. దేశ సమైక్యతకు సమగ్రతకు ప్రమాదాన్ని కలిగించేలా బిజెపి పాలన ఉందని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మోడీ ప్రభుత్వానికి లౌకికతత్వం, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఏ మతమైనా వారి విశ్వాసాలకు, నమ్మకాలకు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించి అందరూ ఐకమత్యంగా ఉండాలని చెబుతుంటే, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేసి మనువాదం ప్రవేశపెట్టేలా ఉందన్నారు. స్త్రీలను పురుషుల చేతులలో అనగదొక్కే విధంగా ఉండాలని చూస్తున్నారన్నారు. బిజెపి ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ప్రజలపై భారాలు మోపి అదాని, అంబానీ లాంటి కార్పొరేట్‌సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. పేదరికానికి ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. సేవా, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి పోవాలని సూచించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు రాష్ట్రంలోని టిడిపి జనసేన పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని వారి విధానాలను



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. గత మూడు సంవత్సరాలలో నిర్వహించిన పోరాటాల వివరించారు. భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకొని రాబోవు మూడు సంవత్సరాల్లో ప్రణాళికలు రూపొందించుకొని ప్రజల్లోకి వెళ్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి డి .గౌస్ దేశాయ్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, నగర నాయకులు పిఎస్ సుజాత, ఆవాజ్ నాయకులు ఇక్బాల్ హుస్సేన్, మెహమూద్ , రవి, కుమార్, పాల్గొన్నారు.

ఉత్తేజపరిచిన చైతన్య గీతాలు : సిపిఎం ఓల్డ్ సిటీ నగర కమిటీ 20వ మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు కార్యకర్తలను ఉత్తేజపరిచాయి. ప్రజా నాట్యమండలి కళాకారులు ఇ రాజు, బాలు, ఏలియా, బతుకన్న, సాములు, నాగ సుంకన్న, నోమేశ్వరి ,సరిత, లక్ష్మిలు "ఓ అరుణ పతాకమా జిందాబాద్, వీరులారా సూరులారా ఎర్ర జెండా బిడ్డల్లారా, సిపిఎం జిందాబాద్ మార్క్సిజం, లెనినిజం జిందాబాద్, ఆశయాల బాటలో ఎన్నో వసంతాలు సిపిఎం చరితంతా సమరశీల అక్షరాలు, నా తోడు నీడ నా ఎర్ర జెండా నా చిలక నువ్వు నా ముద్దుల కొండ, ఆ సుత్తి మా నాన్న, ఆ కొడవలి మా అమ్మ, మాకినేని బసవ పున్నయ్య, నంబూద్రి, సీతారాం ఏచూరి, సోమన్న అమరులారా మా వీరులారా లాల్ సలాం, ఎర్రని జెండా అండగా ఉండగా దండు నడవగా పదరా, తదితర చైతన్యగీతాలను ఆలపించి కార్యకర్తలను ఉత్తేజపరిచారు.



కాండోనేషన్ ఫీజు డబ్బు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, డిఎస్‌సి పరీక్షను ఒకే ప్రశ్నాపత్రం ఉండేలాగా చర్యలు తీసుకోవాలను కోరుతూ బిర్లా గేట్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మొదటి సంతకం మొదటికే మోసం వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే ఓటమి పాలయ్యిందన్నారు. ఈ ప్రభుత్వనికి కూడా అదే గతి పట్టించుకుంటారా అని ప్రశ్నించారు. డిసెంబర్ నాటికి డిఎస్‌సి పరీక్షను పూర్తి చేసి ఉద్యోగాలు పూర్తి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఏదో ఒక కారణం చెప్పి మరో ఆరు నెలలలో పూర్తి చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు కావాల్సిన వివరాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో రాష్ట్రంలో కూడా వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ షెడ్యూల్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాష, అబ్దుల్లా, కర్నూలు మండల అధ్యక్షులు సురేష్, నగర ఉపాధ్యక్షులు సాయిఉదయ్, నాయకులు ఖాజా నిరుద్యోగులు ఉమర్, చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్ నాయక్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్

విచారించి న్యాయం చేస్తాం

-జిల్లా ఎస్‌పి బిందుమాధవ్

-ఎస్‌పి కార్యాలయానికి 123 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పోలీసు అధికారులు త్వరితగతిన స్పందించి వేగంగా పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లా ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి జి. బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్‌పి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 123 ఫిర్యాదులు వచ్చాయి. సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల

మరమ్మతులకు రూ.8 కోట్లు

- కలెక్టర్ పి.రంజిత్ బాష వెల్లడి
- గ్రీవెన్స్‌లో బాధితుల నుండి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టల్స్ మరమ్మతులకు రూ. 8కోట్ల నిధులు విడుదల అయ్యాయని, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష వెల్లడించారు. బిసి హాస్టళ్ల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాల పై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్‌కు సంబంధించి లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొన్ని శాఖల అధికారులు లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను ఓపెన్ చేసి చూడడం లేదని, ఈ అంశంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. సి.బెళగల్ తహశీల్దార్, కర్నూలు ఆర్‌డిఓ వెల్దుర్తి తహశీల్దార్, మద్దికెర తహశీల్దార్,గూడూరు తహశీల్దార్, ఎమ్మిగనూరు తహశీల్దార్ 1 నుంచి 5 రోజుల్లోపు అర్జీలు చూడలేదని, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఏడు రోజులైనా చూడలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాడ్మింటన్ జట్టును అభినందిస్తున్న ఆర్‌యు విసి ఎన్‌టికె నాయక్

ఆర్‌యు బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు అభినందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

గత నెల 26 నుండి 30 వరకు విటియు బెళగావి ఆధ్వర్యంలో ఇటీవల ముగిసిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంట్‌లో రాయలసీమ విశ్వవిద్యాలయం బ్యాడ్మింటన్ మహిళా జట్టు 3వ స్థానంలో నిలిచింది. అంతేకాకుండా 2024 - 25 సంవత్సరానికి ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌కు యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళా జట్టు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం క్రీడాకారులు, కోచ్‌లకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టికె నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ కుమార్ నాయుడు పాల్గొన్నారు. విసి మాట్లాడుతూ అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు జట్టు సభ్యులకు ధన్యవాదాలు తెలిపి, ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో విజేతలుగా తిరిగి రావాలని కోరారు. ఆల్ ఇండియా , ఖేలో ఇండియాకు వరుసగా మూడుసార్లు అర్హత సాధించిన ఏకైక విశ్వవిద్యాలయం మనదే అని, మరే ఇతర ఎపి విశ్వవిద్యాలయాలు ఈ ఘనత సాధించలేదని పేర్కొన్నారు. యూనివర్శిటీకి ఖ్యాతి తీసుకొచ్చినందుకు వైస్‌ఛాన్సలర్ జట్టు సభ్యులను జ్ఞాపికలతో సత్కరించారు. ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌ను ఏప్రిల్ లేదా మే నెలలలో నిర్వహిస్తారని ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెవి శివ కిషోర్ తెలిపారు. టోర్నమెంట్ కోసం ఆటగాళ్లు తమ వంతు కృషి చేయాలని కోరారు. శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ విజయ కుమారి పాల్గొన్నారు. జట్టులో ఎం.ఆకాంక్ష, ఎన్.జాహ్నవి, సిహెచ్ఎస్ఆర్ ప్రణవి, ఎఫ్ షిరీన్, ఎల్.మామైక్య సభ్యులుగా ఉన్నారు. వీళ్లంతా నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ లో చదువుతున్నారు. జట్టు మేనేజర్ గా కోచ్ జి హేమంత్ రెడ్డి వ్యవహరించారు.

వరి, పొగాకు కోతలు ప్రస్తుతం ఆపాలి

ప్రజాశక్తి సి బెళగల్



వరి, పొగాకు కోతలను ప్రస్తుతం ఆపాలని సి బెళగల్ ఎఓ మల్లేష్ తెలిపారు. ఈ నెల 11 నుండి భారీ తుఫాన్ రానుందని అన్నారు. ఇందులో భాగంగా సోమవారం పొగాకు పంటలను, కోత నిల్వలను, వరి పొలాలను నూర్పిళ్ల ప్రదేశాలను పరిశీలించారు. తుఫాన్ సందర్భంగా వరి, పొగాకు పంటలను కోయవద్దని ఒక వేల కోసిన రైతులుంటే టార్పాన్లను సిద్ధం చేసుకోవాలన్నారు. వరి కోసి పోలాలలోనె ఉంటే వాటిపై ఎకరాకు 25 కేజీలు ఉప్పు చల్లి ఉంచితే నష్టాలను అదిగమించ వచ్చన్నారు.

మొక్కుబడిగా స్కానింగు

-సూచనలు, సలహాలు కరువు- వైద్యులు , సదుపాయాలున్నా పట్టించేకోరు

-పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణుల ఆవేదన

ప్రజాశక్తి-పత్తికొండ

గర్భిణీలకు సూచనలు, సలహాలు ,అవగాహన కల్పించడం లేదంటూ గర్భిణీ స్త్రీలు డాక్టర్లపై మండిపడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెల 9న ప్రధానమంత్రి మంత్రిత్వ సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేస్తారు. గర్భంలో బిడ్డ పరిస్థితి ఏమిటి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పాలి. పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని గర్భిణీలకు తూతూ మంత్రంగా స్కానింగ్ నిర్వహిస్తున్నారు. ఎలాంటి సూచనలు , సలహాలు ఇవ్వడం లేదని గర్భిణీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణీకి స్కానింగ్ చేసిన వెంటనే వైద్యాధికారి గర్భంలోని బిడ్డ బాగోగులు గురించి కూడా చెప్పడం లేదంటున్నారు. అలాంటప్పుడు ఆస్పత్రికి ఎందుకు రావాలని అంటున్నారు. సోమవారం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి పత్తికొండ తుగ్గలి మద్దికేర మండలాల నుంచి వచ్చిన గర్భిణీ స్త్రీలు దాదాపు 150 మందికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రిలో మౌలిక వసతులు ఉన్నా రోగులకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయి. పత్తి కొండ ప్రభుత్వ ఆస్పత్రి వ్యవహారంపై వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



పత్తికొండ ఆస్పత్రిలో స్కానింగు కోసం వచ్చిన గర్భిణులు

స్కానింగ్ చేసి పంపించారు-గర్భిణీ శ్రావణి పత్తికొండ



ప్రతి నెల 9న ప్రభుత్వ ఆసుపత్రిలోని స్కానింగ్‌కు వస్తాను. స్కానింగ్ చేసిన వెంటనే గర్భంలోని బిడ్డ గురించి ఎలాంటి సూచన సలహాలు ఇవ్వడం లేదు. ఎంతో ఆశతో వస్తే డాక్టర్లు సమయం కేటాయించడం లేదు. స్కానింగ్ చేశామా పంపామ అంతే....

కుటుంబ నియంత్రణ ఎక్కడ చేసుకోవాలి : బాలింత అనిత లింగనేని దొడ్డి గ్రామం తుగ్గలి మండలం



ఐదు రోజుల కిందట పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని మగబిడ్డకు జన్మనిచ్చాను. బిడ్డకు ఇంజక్షన్ వేస్తానంటే వచ్చా. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఎక్కడ చేసుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నాం. మాతో మాట్లాడే వైద్యులు లేరు ఎవరికి చెప్పుకోవాలి.

యువత భవిష్యత్తు కోసం అవినీతిపై పోరాటం

స్పెషల్ పోలీస్ డిఎస్‌పి మహబూబ్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

యువత భవిష్యత్తుకోసం అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాని స్పెషల్ పోలీస్ డిఎస్‌పి మహబూబ్‌బాషా సూచించారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ,నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ ,నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలు సంయుక్త ఆధ్వర్యంలో టౌన్ మోడల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ భవనంలో అవగాహన సభ నిర్వహించారు. స్పెషల్ పోలీస్ డిఎస్‌పి మహబూబ్ బాషా మాట్లాడారు. అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపల్ సి.సుంకన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైతిక విలువలను కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తు సమసమాజ స్థాపనలో నేటి యువతదే కీలక పాత్ర అవుతుందన్నారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సుపరిపాలన, జవాబుదారితనం, రాజకీయ నిబద్ధతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నిలబడాలన్నారు. రిటైర్డ్ డిఎస్‌పి అడ్వకేట్ పాపారావు మాట్లాడుతూ అవినీతి ఏ రూపంలో జరిగినా అది నేరమేనన్నారు. లంచం ఇవ్వడం తీసుకోవడం రెండు నేరాల కిందికే వస్తాయన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ జిల్లా కార్యదర్శి అడ్వకేట్ రవికుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రధాన సూత్రాలలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడం అతి ముఖ్యమైనది అన్నారు. అవినీతి నిరోధకదేశంగా డెన్మార్క్ మొదటి స్థానంలో ఉంటే భారతదేశం 75 వ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీ సైన్స్ అధిధ్యాపకులు ఎన్.జలగంగాధర్ మాట్లాడారు. అనంతరం అవినీతి రహిత సమాజంలో యువత పాత్ర అంశంపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు జరిగిన వ్యాసరచన పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వత్తి విద్యా అధ్యాపకులు ఎన్.లలితా కుమారి ,కె.రోహిణి, రచయిత పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ డిఎస్‌పి మహబూబ్‌బాష



జిజిహెచ్‌లో గుండెకు అత్యాధునిక చికిత్స

గుండె ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వారం క్రితం హైదరాబాద్ లోని షెరటాన్ హోటల్లో ఎంఐసిఎస్ , రోబోటిక్ ఆపరేషన్‌లో మెలకువలు నేర్చుకోవడానికి డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డివెళ్లారు. అందులో సారాంశాన్ని ఇంకొంచెం బాగా ఉపయోగిస్తూ సోమవారం జిజిహెచ్‌లో ఒక ఎంఐసిఎస్ ఆపరేషన్ విజయవంతంగా చేశారు. ఆ కేసు వివరాలు డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి మాటల్లో... నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్టకందాలకు చెందిన ఖాజాబాష 13 యేళ్ల బాలుడు, గుండెకు రంధ్రం ఉందని కార్డియాలజీ నుంచి మా దగ్గరికి వచ్చాడు. ఈ అబ్బాయికి గుండెలో హోల్ ఉంది. మామూలుగా అయితే స్టెర్నం బోన్ కట్ చేసి చేయడం వలన దాదాపు పెద్దగా ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. బోన్ కూడా కట్ చేయాల్సి వస్తుంది. ఆపరేషన్‌లో రక్తం ఉపయోగం ఎక్కువగా ఉంటుంది , రికవరీ లేటుగా ఉంటుంది. మరల తన పనులు చేసుకోవడానికి ఈ ఎముక మానేంతవరకు కూడా కష్టంగా ఉంటుంది. కానీ ఈ చిన్న కోత ఆపరేషన్ చేయడం వలన ఎముక కట్ చేసే పని ఉండదు. చాతి పక్కలో ఆరు సెంటీమీటర్ల ఇన్‌సేషన్ ఇచ్చి మనం కిటికీలోంచి చూసినట్లు లోపలికి చూస్తూ ఆపరేషన్ చేయవచ్చు.. ఈ ఆపరేషన్ ఉదయం 10-2 గంటల మధ్యలో అయిపోతే సాయంత్రం 4 కు వెంటిలేటర్‌ను తొలగించాం. రక్తం అవసరం తక్కువ. 3 -4 రోజులలో డిశ్చార్జి చేయచ్చు.. నెల తరువాత అన్ని పనులు చేసుకోవచ్చు. ఈ ఆపరేషన్ హైదరాబాద్, బెంగళూరు లాంటి కార్పొరేట్ ఆసుపత్రులలో మాత్రమే చేస్తారు. దీనికి రూ.6 నుంచి రూ.8 లక్షలు ఛార్జి చేస్తారు. ఇన్సూరెన్స్ ఉంటే ఇంకా కొంచెం ఎక్కువ ఛార్జి ఉంటుంది. మేము ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలులో దీనిని ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఎటువంటి చార్జీలు వసూలు చేయకుండా ఉచితంగా చేశాం. చిన్నపిల్లవాడు కదా ఎదిగే వయసు కావున చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది. ఈ ఆపరేషన్ పెళ్లికాని ఆడపిల్లలకు కూడా కాస్మెటిక్‌గా బాగుంటుంది. దీనిని సినిమా యాక్టర్లు అటువంటి వాళ్ల కోసం మొదట కనిపెట్టారు. ఇటువంటి చిన్న కోత ఆపరేషన్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మాత్రమే ప్రభుత్వాసుపత్రిలలో చేశాం. ఇంతవరకు 60 ఆపరేషన్లు వరకు వివిధ రకాల ఆపరేషన్లు ఎఎస్‌డి, ఎంవిఆర్, ఎవిఆర్, డివిఆర్, మిడ్ క్యాప్జి చేశాం. ఈ ఆపరేషన్‌లో మత్తుమందు నిపుణులు డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ రవీంద్ర, రమేష్ పెర్ఫ్యూజినిస్ట్ , ఇతర ఆసుపత్రి సిబ్బంది సిటివిఎస్ విభాగంలో పనిచేసే వాళ్లు పాల్గొన్నారు. ఇదంతా ఓ పెద్ద టీమ్ వర్క్.. ఆపరేషన్ సక్సెస్ గా జరిగేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.. కార్డియాలజీ డిపార్టు వైద్యులకు ప్రత్యేక అభినందనలు.

నాణ్యతగా అర్జీలకు పరిష్కారం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా నాణ్యతగా పరిష్కరించి అర్జిదారులు సంతృప్తి పొందేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్ పాల్గొని వినతులను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఇఒ వెంకట రమణ రెడ్డి ఉన్నారు.

రికార్డు స్థాయి సభ్యత్వ నమోదు లక్ష్యం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడును సన్మానిస్తున్న నాయకులు

నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో టిడిపి సభ్యత్వం నమోదు చేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని దిబ్బనకల్లు గ్రామంలో సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నాయకత్వంలో నియోజవర్గం టిడిపికి కంచుకోటగా ఉండేదని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ప్రతి ప్రాంతాన్ని సందర్శించి.. చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సభ్యత్వం తీసుకునేలా చూస్తామన్నారు. నాయకులు రంగస్వామి నాయుడు, దిబ్బనకల్ లక్ష్మన్న, వలమన్న, రంగన్న, దొడ్డనకేరి శివప్ప, బసవరాజు, రామస్వామి, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, వెంకటేష్, కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున, జైరామ్, రవి, అయ్యన్న, నాగరాజు, బాబు నాయుడు, శ్రీనివాస్ చౌదరి, అయ్యన్న, గోపాల్, సయ్యద్ బాషా ఉన్నారు.

భూసార పరీక్షలను వినియోగించుకోవాలి

- ఎడిఎ మోహన్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ



భూసార కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భూసార పరీక్షలను రైతులు వినియోగించుకోవాలని పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం దేవనకొండ రైతు సేవా కేంద్రంలో మట్టి నమూనా పరీక్షల ఫలితాల, భూసార పరీక్ష పత్రం కార్డులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 285 భూసార పరీక్షల కార్డులు వచ్చాయని తెలిపారు. వాటిని గ్రామాల వారీగా పంపిణీ చేస్తామని చెప్పారు. రైతు వివరాలు, ఏ పంటకు ఎంత ఫర్టిలైజర్ వినియోగించుకోవాలో ఈ కార్డులో పొందుపరిచినట్లు తెలిపారు. రైతులు ఎరువుల వినియోగం, మట్టిలో పోషకాల శాతం, వాటి సాంద్రత పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇన్‌ఛార్జీ ఎఒ డి.మునెమ్మ, ఎఇఒలు రంగన్న, మల్లికార్జున, అబ్దుల్ సలాం, విఎఒలు మల్లికార్జున, రంగాచారి పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు.. 'ఉపాధి' కల్పిస్తాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఉల్లిగయ్య, అడివప్ప గౌడ్

వలసలు వెళ్లొద్దని, సొంత గ్రామాల్లోనే కూటమి ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తుందని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని వల్లూరు గ్రామంలో ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉండాలని, పిల్లల చదువుకు అంతరాయం కలుగకుండా కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పనులు చేపట్టిందని తెలిపారు. రోజువారీ వేతనం కూడా తగిన డబ్బు చెల్లిస్తుందని చెప్పారు. బెంగళూరు, గుంటూరు, తెలంగాణ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సొంత గ్రామాల్లోనే ఉపాధి పనులు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఎపిఒ మాధవశంకర్, టిఎ సుధాకర్, ఎఫ్ఎ బసవ పాల్గొన్నారు.

బోరు, కుళాయి నీరే గతి..!

- **ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి రాని ఆర్ఓ ప్లాంట్లు**
- **ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు అందుబాటులోకి రావడం లేదు. విద్యార్థులకు బోరు, కుళాయి నీరే గతి అయ్యాయి. ఆ నీరు తాగలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో తాగునీటిని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛమైన నీరు అందించాలని గత వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాల్లో ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని జడ్‌పి హైస్కూల్‌తో కొన్ని పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు మూలన పడేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుంటే ఐదు, ఆరింటిలో తప్ప మిగిలిన పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు పనిచేయడం లేదు.

ఖాళీగానే ఆర్ఓ ప్లాంట్లు

పాఠశాలలో నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పటి నుంచో ఆర్ఓ ప్లాంటు ఖాళీగానే ఉంది. విద్యార్థులు బోరు, కుళాయి నీటినే తాగుతున్నారు. ఆర్ఓ ప్లాంటు నెలల తరబడి ఖాళీగానే దర్శనమిస్తోంది. రోగాలకు భయపడి తల్లిదండ్రులు పిల్లలకు సీసాల్లో నీరు నింపి పంపుతున్నారు. భోజన సమయానికే పిల్లలు తెచ్చుకుంటున్న నీరు అయిపోతుండడంతో విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. పక్కనే ఉన్న బోరు, కుళాయి నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది.

మరమ్మతులతో మూలకు

మండలంలో 80 శాతం పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు పని చేయడం లేదు. కొన్నిచోట్ల దాతలు ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. మరికొన్ని పాఠశాలల్లో ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. కొన్ని నెలలకే అవన్నీ మరమ్మతులకు గురయ్యాయి. ఫిల్టర్ క్యాండిల్స్ అరిగినా.. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. మరమ్మతులు చేయాలని ప్రధానోపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. మరికొన్ని పాఠశాలల్లో మోటార్ల వైరింగ్ కాలిపోయి తాగునీరు అందడం లేదు.

పాఠశాలలో నీరు కరువు

విద్యార్థులు తాగేందుకు నీటిని ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిందే. అవి కూడా మధ్యాహ్న భోజనం వరకే ఉంటున్నాయి. సాయంత్రం వరకు నీళ్ల లేకపోవడంతో పిల్లలకు ఇబ్బంది అవుతోంది. స్కూల్‌లో ఉన్న ట్యాంకులో నిల్వ ఉన్న నీటిలో పురుగులు వస్తున్నాయి. పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. స్కూల్‌లోనే తాగునీరు అందుబాటులో ఉంటే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

మండలమంతా అదే తీరు..!

వందలాది మంది పిల్లలకు కుళాయి నీరే దిక్కువుతోంది. విరుపాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ అందుబాటులోకి రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ బడిలోనూ విద్యార్థులకు తాగునీరు అందడం లేదు. విద్యార్థులు బోరు, కుళాయి నీటినే తాగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన గత వైసిపి ప్రభుత్వం విఫలమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కుళాయి నీరు తాగుతున్న విద్యార్థులు

పిఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి మండల కార్యాలయంలో సోమవారం పిఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఇ జంభన్న మాట్లాడుతూ... 40 గిగా బైట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.60 వేల కోట్లను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సౌర విద్యుత్ వల్ల ప్రకృతికి నష్టం వాటిల్లదని, విద్యుత్ బిల్లులు కూడా తగ్గుతాయని చెప్పారు. ప్రతి ఇంటి రూఫ్ టాప్ మీద ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్లకు రూ.78 వేల చొప్పున ప్రభుత్వ రాయితీ లభిస్తుందని తెలిపారు. మిగతా సొమ్ము బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలుగా సమకూరుస్తాయని వివరించారు. విద్యుత్ వినియోగం అనేక రెట్లు పెరిగిందని, దానికి తగ్గట్టు ఉత్పత్తి కూడా పెరగాలనే ఆలోచనతో పిఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని రూపకల్పన చేశారన్నారు. ఎడి సంతోష్ మాట్లాడుతూ... పర్యావరణానికి హాని చేయని సౌర శక్తి వాడకాన్ని ప్రజలంతా అలవాటుగా చేసుకోవాలని కోరారు. సౌర శక్తి వినియోగం గోడపత్రికను విడుదల చేశారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాగేశ్వరరావుకు తెలుగు తేజం పురస్కారం

ప్రజాశక్తి - గోనెగండ్ల



అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

మండలంలోని పెద్ద మరివీడు హైస్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆరెకటిక నాగేశ్వరరావుకు ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగు తేజం జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సంస్థ అధ్యక్షులు గొట్టిముక్కల చెన్నకేశవులు ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి జాతీయస్థాయి కవి సమ్మేళనం, తెలుగు భాష గొప్పదనం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రోగ్రామ్ కన్వీనర్‌గా వ్యవహరించారు. తెలుగు భాష ఇతివృత్తాన్ని అద్భుతంగా కవితల రూపంలో వినిపించిన నాగేశ్వరరావును చెన్నకేశవులుతో పాటు గంగిశెట్టి రమేష్, బృంద, నారాయణస్వామి తెలుగుతేజం జాతీయ పురస్కారంతోపాటు శాలువా పూలమాల, ప్రశంసాపత్రం, మెమొంటో ఇచ్చి సన్మానించారు. ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయ సంఘం నాయకులుగా సేవలందిస్తూ తెలుగు భాషపై మమకారంతో ఎన్నో పుస్తకాలు రాసి, సాహిత్యానికి, తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేస్తున్న నాగేశ్వరరావుకు అవార్డు రావడం పట్ల తోటి ఉపాధ్యాయులు సోమవారం అభినందనలు తెలిపారు.



భూమిపూజ చేస్తున్న నాయకులు

డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఎంపిపి నిధులు దాదాపు రూ.2.25 లక్షలతో పనులు చేపట్టేందుకు వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ముక్కరన్న, అర్లప్ప ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట డ్రైనేజీ నిర్మాణం, కల్వర్టు, దొడ్డిమేకల రహదారిలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని పనులు ప్రారంభించామని చెప్పారు. కాంట్రాక్టర్ అనిల్, ఎంఆర్‌పిఎస్ నాయకులు యువరాజు, ఆదాము, గ్రామ పెద్దలు కుమార్ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే ఉపాధ్యాయుని సస్పెండ్

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే ఉపాధ్యాయుడు శ్రీనివాసులును విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఆదోని మండలం సంతేకుడ్లూరు మండల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మద్యం సేవించి.. విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేసిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యపై కలెక్టర్, డిఇఒకు వినతిపత్రాలు ఇస్తూ ఫిర్యాదు చేశామన్నారు. విచారించిన విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుడు శ్రీనివాసులుపై సస్పెన్షన్ వేటు వేశారని, అందుకు సంబంధించిన సర్క్యులర్ విడుదల చేశారని తెలిపారు.

ఫీజుల కోసం వేధిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌టిఇ ప్రయివేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యా హక్కు చట్టం ద్వారా ప్రయివేట్ పాఠశాలల్లో 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వం ద్వారా ఎంపికయిన విద్యార్థులు ఫీజు కట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. సోమవారం ఎమ్మిగనూరు ఆర్‌టిఇ ప్రయివేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాది, సామాజిక ఉద్యమ కార్యకర్త అడ్డాకుల తిమ్మప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.రంగప్ప, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు జి.వీరేష్ యాదవ్ మాట్లాడారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ)కింద సెక్షన్ 12(సి)ప్రకారం ప్రతి ప్రయివేట్ పాఠశాలలో ప్రతి విద్యా సంవత్సరం 1వ తరగతి ప్రవేశాల్లో వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, గిరిజనులకు 4 శాతం, వెనుక బడిన వర్గాల పిల్లలకు 6శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని ఉందని తెలిపారు. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో చేరేందుకు నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థులను ఎంపిక చేసిందన్నారు. 'మేము హైకోర్టులో కేసు వేసి జిఒ రద్దు చేయించుకున్నాం. విద్యార్థులు ఫీజు చెల్లించాల'ని నారాయణ, భాష్యం, మాచాని సోమప్ప, కస్తూరి, గుడ్ షెఫర్డ్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. 'మీ పిల్లలకు చదువు చెప్పబోం' అని విద్యార్థులను అవమానిస్తున్న ప్రయివేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తేనే దరఖాస్తు చేసుకున్నారని, అర్హత ఉన్న విద్యార్థులను మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసి ఆయా పాఠశాలలో చేరాలని చెప్పిందని, ఇప్పుడు ఫీజు కట్టాలంటే ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఫీజులు కట్టుకునే స్తోమత ఉంటే ఉచిత విద్యకు ఎందుకు దరఖాస్తు చేసుకుంటారని నిలదీశారు. ఇలాగే ఫీజుల కోసం వేధిస్తే ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రయివేట్ పాఠశాలలకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శేష ఫణికి వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిఇ ప్రయివేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు అహ్మద్, రాజ్ కుమార్ నాయుడు, రాజు, పురుషోత్తం, సురేష్, షణ్ముఖ, సూర్యప్రసాద్, నబి రసూల్, నరసింహులు, ఏక్ నాథ్, తౌకీర్, రవి కుమార్, జయరాం, జిలానీ, ఇర్ఫాన్, రఘు,రమేష్, వీరేష్, పీర్ బాష పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు



లక్ష దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కనులపండువగా లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని జె.హోసల్లి గ్రామంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాశీ నుంచి కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వర డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య భగవద్పాదం హాజరయ్యారు. ఎమ్మెల్యే బి.విరుపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్, శంభులింగ స్వామి, డాక్టర్ మహేశ్వర, ఆంధ్ర, కర్ణాటక భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజలో ఎమ్మెల్యే

చిప్పగిరి : చిప్పగిరిలో వడ్డే మణికంఠకు సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బి.విరుపాక్షి హాజరయ్యారు.

ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ రిజిస్టర్‌ను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్లతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ రిజిస్టర్ నిర్వహిస్తున్నారని, రద్దు చేయాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు భీమేష్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ ఎడిఎ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మాత్రమే ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయిస్తున్నారని, ఇది ఆపరేటర్ల విధులకు విరుద్ధమని తెలిపారు. అధికారులకు ఆపరేటర్ల విధులు తెలుసని అన్నారు. రద్దు చేయకపోతే కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు హనీఫ్, జావీద్, దేవేంద్ర రెడ్డి, రాఘవేంద్ర, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిలకు పెంచాలి

- సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిలకు పెంచి, ఆస్పరి మండలాన్ని ప్రాజెక్టులోకి చేర్చి సాగు, తాగునీరు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నూతన మండల కమిటీ సమావేశం రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయని, వాటి బారి నుంచి పంటను కాపాడి రైతులను ఆదుకోవాలని కోరారు. దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేయాలని తెలిపారు. జోహరాపురం గ్రామ సమీపంలో స్టోరేజ్ సంపు నిర్మించి మండలానికి తాగునీరు అందించవచ్చని చెప్పారు. హంద్రీనీవా నుంచి మండలంలోని వెంగళాయిదొడ్డి, చిన్నహోతూరు, ఆస్పరి, ముత్తుకూరు చెరువులను నింపాలని కోరారు. పాఠశాలకు నాడు-నేడు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలన్నారు. ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని, కూరగాయల మార్కెట్‌కు పంచాయతీ స్థలం కేటాయించి రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ములుగుందం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని, మండలంలో 33 గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు, మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, రవి, ఈరన్న, రవి, వీరబద్రి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

పోలీసులపై ప్రజలకు నమ్మకం కలగాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - మంత్రాలయం

తమ రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్నారనే నమ్మకం ప్రజల్లో పోలీసులపై కలగాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. సోమవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయంలో అసాంఘిక కార్యకలాపాలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసులంటే భయం పోయి స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయనే భావన ఉన్నప్పుడే పోలీసు స్టేషన్‌కు వస్తారని, ఆ నమ్మకాన్ని కలిగించాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ పాల్గొన్నారు.



'శ్మశానానికి స్థలం కేటాయించాలి'

ప్రజాశక్తి - ఆదోని

మృతదేహాన్ని ఖననం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, శ్మశానానికి స్థలం చూపాలని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వెంకటేష్, నాయకులు శ్రీనివాసులు కోరారు. సోమవారం పర్వతాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ శివరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణ శివారులో కాలనీ ఉందన్నారు. హిందూ శ్మశాన వాటిక, ముస్లింల ఖబరస్తాన్‌కు స్థలం కొరత వేధిస్తోందన్నారు. ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని, అక్కడికి వెళ్లేందుకు రస్తా గుండా ముళ్ల పొదలను తొలగించాలని కోరారు. ఇతర సామాజిక వర్గాల శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి గుంతల మయంగా మారిందని, మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించడానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రభుత్వం తీసుకొచ్చిందని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్‌లో అధికారులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులకు సంబంధిత అధికారులతో ఆయా దరఖాస్తులను బట్టి పూర్తి వివరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో పొలం సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తున్నామన్నారు. ఆర్ఐ సునీత, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

'సమస్యలపై స్పందించండి'

ప్రజాశక్తి - ఆదోని

దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలని మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ ఛైర్మన్ శాంతకు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సోమన్న, అహ్మద్, శివరాం, శివ, పీరా మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు డిగామని తెలిపారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తూ తమ సహనాన్ని ప్రభుత్వం పరీక్షిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేస్తున్న తమకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం లేదన్నారు. అరకొర వేతనంతో పిల్లల స్కూల్ ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. గతంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తమ డిమాండ్లను విన్నవించగా అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, లేకపోతే విధులను బహిష్కరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు శివ, కృష్ణమూర్తి, కర్రెప్ప, రామాంజనేయులు, కైలాష్ ఉన్నారు.



ఛైర్మన్ శాంతకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. యుటిఎఫ్ నాయకులు ఎస్.దావీదు, ఎన్.నాగమణి, జె.ఎల్లప్ప, డి.కౌలన్న, జి.బాబు మాట్లాడారు.

ఎమ్మెల్సీ విజయంపై యుటిఎఫ్ హర్షం

ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో యుటిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపి మూర్తి విజయం సాధించడంపై యుటిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కె.లక్ష్మన్న, యు.చంద్రపాల్, వై.రామాంజనేయులు, ఎ.దేవపాల్, నరసింహులు, ఎం.రాజు, ఎన్.నాగరాజు, శివకుమార్, రామ్మోహన్, ఎ.నాగేశ్వరరావు, తాతయ్య, కె.నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విజయం పట్ల యుటిఎఫ్ సంబరాలు

ప్రజాశక్తి - ఆదోని

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపి మూర్తి విజయం సాధించడంతో సోమవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాది లింగప్ప మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో గళమెత్తి పరిష్కారానికి కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన గెలుపు ఉపాధ్యాయుల విజయమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ఉపాధ్యాయులు ఐక్యం కావాలన్నారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ మెంబర్స్ మల్లికార్జున, రామాంజినేయులు, అకాడమిక్ కన్వీనర్ నరసయ్య గౌడ్, మండల అధ్యక్షులు నాగేంద్ర, పట్టణ అధ్యక్షులు జగన్మోహన్, ఉపాధ్యాయులు కృష్ణుడు, నాగేష్, విష్ణు, లింగన్న ఉన్నారు.



సంబరాలు చేసుకుంటున్న యుటిఎఫ్ నాయకులు